సాక్షి ఒడిశా

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,51,767లు, బంగారం 3గ్రాముల 580 మిల్లీగ్రాము, వెండి 154గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



గంజాయి స్వాధీనం

రాయగడ జిల్లాలో 1837 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ధ్వంసం చేశారు.

- 8లో



సభ వాయిదా

శాసన సభలో గందరగోళం నెలకొంది. దీంతో సభను వాయిదా వేశారు.

- 8లో

జగన్నాథుని.. రత్న ఆభరణాల తరలింపు

భువనేశ్వర్:

పూరీ శ్రీ మందిరం రత్న భాండాగారానికి అమూల్య రత్న సంపదను విజయవంతంగా తరలించారు. రత్న భాండాగారం నిర్వహణ, పునరుద్ధరణ పురస్కరించుకుని భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ ప్రత్యక్ష పర్యవేక్షణలో గత కొన్ని నెలలుగా రత్న భాండాగారం లోపలి, వెలుపలి గదుల మరమ్మతు పనులు కొనసాగిన విషయం తెలిసిందే. ఈ పనులు పూర్తి కావడంతో రత్నాభరణాలను మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల మధ్య శుభ ఘడియల్లో తరలించాలని శ్రీ మందిరం పాలక మండలి నిర్ధారించింది. ఈ నిర్ధారణ ప్రకారం 11 మంది సభ్యులతో కూడిన అధీకృత సభ్యుల బృందం ఉదయం 10 గంటలకు శ్రీ మందిరం లోనికి ప్రవేశించింది. అనంతరం ఉదయం 10.55 గంటలకు రత్నాభరణాల తరలింపు ప్రారంభించారు. ఈ ప్రక్రియ నిరవధికంగా మధ్యాహ్నం 2.55 గంటలకు కొనసాగింది. ఈ నిడివిలో సాధారణ భక్తులకు ఆలయ ప్రవేశం నిరాకరించి సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేశారు. ఆభరణాలు, సామగ్రి తరలింపు పూర్తి కావడంతో భాండాగారం లోపల, వెలుపల గదులకు తాళాలు వేశారు. తాళం చెవిల్ని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో భద్రపరిచారని శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి తెలిపారు.



భాండాగారానికి రత్నాభరణాల తరలింపు ప్రత్యక్షంగా పర్యవేక్షించిన అధీకృత కమిటీ సభ్యుల బృందం

అధీకృత కమిటీ పర్యవేక్షణ

శ్రీ జగన్నాథుని అమూల్య రత్న సంపదని పాలక మండలి ఏర్పాటు చేసిన ప్రత్యేక అధీకృత కమిటీ ప్రత్యక్ష పర్యవేక్షణలో భాండాగారానికి తరలించారు. ఈ కమిటిలో శ్రీ మందిర్ ముఖ్య నిర్వాహకుడు, పూరీ జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్, భారత పురావస్తు శాఖ అధికారి, రత్న భాండాగారం ఉప కమిటీ సభ్యుడు గణేష్ దాస్ మహాపాత్రో, దెవులో కొరాణొ, తొడావు కొరాణొ, భండార్ మేకప్, రత్న భాండాగారం పర్యవేక్షణ కమిటీ నుంచి ఇద్దరు సభ్యులు జస్టిస్ బిశ్వనాథ్ రథ్, సుదర్శన్ పట్నాయక్, ఛొత్తీషా నియోగ్ మహానాయక్ జనార్దన్ పట్టజోషి మహాపాత్రో, గజపతి మహారాజా ప్రతినిధి, శ్రీమందిర్ సేవ మరియు అభివద్ధి నిర్వాహకుడు, అదనపు చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉన్నారు.

గట్టి భద్రత

శ్రీ మందిరం నలు వైపుల ద్వారాల ప్రాంగణాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తనిఖీలు కట్టుదిట్టంగా నిర్వహించారు. సింహ ద్వారం గుండా అధీకృత సభ్యులు శ్రీ మందిరం లోనికి ప్రవేశించారు. ప్రభుత్వం రూపొందించిన నిర్దేశిత కార్యాచరణ (ఎస్‌ఓపీ) ప్రకారం రత్నాభరణాలు, సామగ్రి తరలించారు. ఎలాంటి లోపాలు జరగకుండా ఉండటానికి తరలింపు సమగ్ర ప్రక్రియను వీడియోలో రికార్డ్ చేశారని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. రత్నాలు, ఆభరణాల కమిటీ హై పవర్ కమిటీ నిర్ణయంతో ఆభరణాల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి అన్నారు.



శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో పోలీసు బందోబస్తు

రణరంగంగా మారిన దిగువ పీఎంజీ



బీజేడీ సంద్రంగా మారిన దిగువ పీఎంజీ ప్రాంతం

- జీజేడీ విజృంభణ
- శాసన సభ ముట్టడికి విఫలయత్నం
- అణచివేతకు చన్నీరు పిచికారీ ప్రయోగం

భువనేశ్వర్:

స్థానిక దిగువ పీఎంజీ ప్రాంతం రణరంగంగా మారింది. మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ అధికారాన్ని తగ్గించే అంశంపై విపక్ష బిజూ జనతా దళ్ (బీజేడీ) స్థానిక దిగువ పీఎంజీ ప్రాంతంలో భారీ ఆందోళన చేపట్టింది. శాసన సభ ముట్టడికి దూకుడు ప్రదర్శించింది. ఆందోళనకారుల్ని అణచివేతకు పోలీసులు జల ఫిరంగుల్ని ప్రయోగించడంతో భయానక వాతావరణం సృష్టించారు. రాష్ట్ర వ్యాప్తంగా 314 మండలాల నుంచి పెద్ద సంఖ్యలో బీజేడీ కార్యకర్తలు, పార్టీ మద్దతు ఉన్న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. రాష్ట్రంలో అధికార బీజేపీ ప్రజాస్వామ్యం, పంచాయతీ రాజ్ వ్యవస్థను హతమార్చిందని ఆరోపిస్తూ బ్యానర్లు, ప్లకార్డులతో నిరసనకారులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. వీరంతా శాసన సభ ముట్టడికి పోలీసులు ఏర్పాటు చేసిన రెండు బారికేడ్లను అధిగమించి దూసుకుపోతుండగా భద్రతా సిబ్బందితో ఘర్షణ పడ్డారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కమిషనరేట్ పోలీసులు పలువురు బీజేడీ కార్యకర్తలు, నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

'భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వం రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను రద్దు చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడి పంచాయతీరాజ్ వ్యవస్థను బలహీనపరుస్తోంది. ఎన్నికైన పంచాయతీ ప్రతినిధులు 'రబ్బర్ స్టాంపులు'గా మారుతున్నారు. బీజేపీ ప్రభుత్వ ఏక పక్ష చర్యలను బీజేడీ తీవ్రంగా నిరసిస్తోంది. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఖూనీ చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తరచుగా ఆందోళనలు కొనసాగుతాయి. గ్రామాల నుంచి నిరసన ప్రదర్శనలు ఉవ్వెత్తున రగులుతాయి' అని హెచ్చరించారు.

బిజూ జనతా దళ్ సీనియర్ నాయకుడు అతున్ సవ్యసాచి నాయక్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా ప్రజా ప్రతినిధులకు సాధికారత కల్పించడంలో దివంగత బిజు పట్నాయక్ మార్గదర్శక పాత్ర పోషించిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు. తర్వాత నాయకుడు నవీన్ పట్నాయక్ పంచాయతీ రాజ్ వ్యవస్థని మరింత బలోపేతం చేశారు. ప్రస్తుత బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎన్నికైన ప్రతినిధుల అధికారాలను తొలగించడానికి కుట్ర పన్నుతోంది. ప్రజా ప్రతినిధులకు ఉన్న అధికారాన్ని అవినీతి అధికారులకు బదిలీ చేయడానికి ఒక కుట్ర జరిగింది. దేశ వ్యాప్తంగా బీజేపీ ఓటు చోరీ చర్చనీయాంశంగా కొనసాగుతుండగా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రతినిధుల అధికారాలను దొంగిలించడంలో నిమగ్నమై ఉంది. ఈ కుట్రకు నిరసనగా బీజేడీ వీధుల్లోకి వచ్చిందని అతున్ సవ్యసాచి నాయక్ తెలిపారు.



ఆందోళనకారులు, పోలీసుల ఘర్షణ



ఆందోళనకారుల్ని చెదరగొడుతున్న పోలీసులు



ఆందోళనకారులపై పోలీసుల జల ఫిరంగుల ప్రయోగం

న్యూస్‌రీల్

పేద, మధ్య తరగతికి ఉపశమనం



మాట్లాడుతున్న కాశీరాం తదితరులు

రాయగడ: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ఎంతోమంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర శాఖ ఎస్సీ, ఎస్టీ విభాగం ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి అన్నారు. స్థానిక సిరిగుడలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. అమలు చేసిన జీఎస్టీలో భాగంగా కొన్ని కేటగిరీలకు 28 శాతం ఉన్న జీఎస్టీ 18 శాతానికి, మరి కొన్నింటికి 12 నుంచి 5 శాతానికి తగ్గించడం జరిగిందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు బసంత ఉలక, రజిత కొరాడ పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి రైల్వే అండర్ పాసేజ్ సమస్య



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వచ్చిన ప్రజలు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి పరిధిలోని పాలిపిండ, రెలిబడిగాం గ్రామాలకు వెళ్లాలంటే మధ్యలోని రైల్వే లైన్ క్రాసింగ్‌ను దాటాల్సిందే. తరచూ రైళ్ల రాకపోకలు జరుగుతుండంతో అవివెళ్లే వరకూ వేచి ఉండాల్సి వస్తుంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలంటే అండర్ పాసేజ్‌లు నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. తాజాగా రెండు గ్రామాలకు చెందిన ప్రజలు జిల్లా కలెక్టర్ అశుతోష్ కులకర్ణిని మంగళవారం కలిసి సమస్యను వివరించారు. రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ పాసేజ్‌ల నిర్మాణం చేపడితే ప్రమాదాల నివారణతోపాటు రాకపోకలకు వీలుగా ఉంటుందని వివరించారు. ఈమేరకు సంబల్‌పూర్ రైల్వే డివిజన్ డీఆర్ఎం పేరిట రాసిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేసి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

అక్రమ కలప రవాణా అడ్డగింత



పట్టుబడిన నిందితులు, టేకు దుంగలను చూపిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో గారబంద, నారాయణపూర్ ప్రాంతాల నుంచి రాత్రివేళ అక్రమంగా ద్విచక్ర వాహనాలపై కలప రవాణా చేస్తున్న ముఠాను అటవీ అధికారులు సోమవారం రాత్రి మాటువేసి పట్టుకున్నారు. పర్లాకిమిడి పోలీసులు, దేవగిరి అటవీ రేంజ్ అధికారులు కలిసి జరిపిన ఉమ్మడి దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి 3 సెల్ ఫోన్లు, 63.78 ఘన చదరపు అడుగుల విలువైన టేకు, వేప, గుంహార్ దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరినీ మంగళవారం స్థానిక సబ్ డివిజనల్ జ్యుడీషియల్ మాజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచామని ఏసీఎఫ్ షైనీశ్రీదాస్ తెలిపారు. జిల్లా అటవీ సంపద కాపాడడానికి రాత్రివేళ ఇక మీదట పెట్రోలింగ్ నిర్వహిస్తామని తెలియజేశారు.

అక్టోబర్ 9న ఓటింగ్



శుభ్రాపండ

రాయగడ: రాయగడ మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ శుభ్రా పండపై 19 మంది కౌన్సిలర్లు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానంపై అక్టోబర్ 9వ తేదీన ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి ప్రకటించారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఓటింగ్ విషయమై మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 24 మంది కౌన్సిలర్లకు తెలియజేయాలని సూచించారు. ఇదిలా ఉండగా పట్టణాభివృద్ధికి సంబంధించి వైస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించే శుభ్రా పండ తమకు ఎటువంటి సహాయ, సహకారాలు అందించడం లేదని, అదేవిధంగా సమస్యలపై దృష్టిసారించకపోవడంతో అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదించినట్లు ఆయా కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎరువుల కొరతపై కిసాన్ కాంగ్రెస్ ఆందోళన



ఎరువుల కొరతపై కిసాన్ కాంగ్రెస్ ఆందోళన

భువనేశ్వర్: రాష్ట్రం అంతటా ఎరువుల కొరత, బ్లాక్ మార్కెటింగ్ పరిస్థితి తాండవిస్తోంది. ప్రభుత్వ ఎరువుల పంపిణీ వ్యవస్థ పూర్తిగా విఫలమైంది. రాష్ట్రంలో యూరియా కొరత, బ్లాక్ మార్కెట్ వెతలతో రైతాంగం ఆందోళన చెందుతోంది. సహకార సంఘాలు, మార్క్ ఫెడ్, ప్రభుత్వంలో అవినీతి జరుగుతోంది. లక్షల రూపాయల విలువైన ఎరువులు నిల్వ ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వం తక్షణమే రైతులు, కౌలు రైతులకు ఆధార్, పొలం విస్తీర్ణం ఆధారంగా ఎరువులు పంపిణీ చేయాలని కిసాన్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎరువుల కొరత, బ్లాక్ మార్కెటింగ్, ప్రభుత్వ అసమర్థతకు వ్యతిరేకంగా రాష్ట్ర కిషాన్ కాంగ్రెస్ మంగళ వారం నగరంలో భారీ ఊరేగింపు నిర్వహించి శాసన సభ ముట్టడికి విఫల యత్నం చేశారు. ప్రభుత్వం రైతుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే గ్రామీణ స్థాయిలో ఆందోళన విస్తరిస్తుందని హెచ్చరించారు.

బరంపురం-ఉధ్నా మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు

భువనేశ్వర్: బరంపురం, ఉధ్నా (సూరత్) మధ్య అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు కల్పించేందుకు రైల్వే బోర్డు ఆమోదం ప్రకటించింది. ఈ ఆమోదం ప్రకారం బరంపురం, ఉధ్నా ప్రాంతాల మధ్య 19021 / 19022 బరంపురం-ఉధ్నా (సూరత్) వీక్లీ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు త్వరలో ప్రవేశ పెడతారు. సేవలు ఆరంభించే తేదీ త్వరలో ప్రకటిస్తారు. 19022 బరంపురం - ఉధ్నా (సూరత్) వీక్లీ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ వారానికోసారి సోమవారం రాత్రి 11.45 గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో 19021 ఉధ్నా (సూరత్) - బరంపురం వీక్లీ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం ఉదయం 7.10 గంటలకు బయల్దేరుతుంది. ఈ రైలు తూర్పు కోస్తా రైల్వే పరిధిలో మహాసముంద్, ఖరియార్ రోడ్, కంటాబంజి, టిట్లాగడ్, కెసింగా, మునిగుడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్లలో ఆగుతుంది.

అర్జున అవార్డు గ్రహీత విజయ్ కుమార్ శత్పతి కన్నుమూత

- ప్రముఖుల సంతాపం



భువనేశ్వర్: అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ రంగంలో దేశానికి, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు ఆర్జించిన అర్జున అవార్డు గ్రహీత విజయ్ కుమార్ శత్పతి (73) మంగళ వారం మృతి చెందారు. బరంపురం అస్కా రోడ్ సమీపం సోమనాథ్ నగర్ ఆయన స్వస్థానం. 1977-78, 1982-83 మధ్యకాలంలో ఐదుసార్లు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌గా నిలిచారు. వెయిటు లిఫ్టింగ్ పోటీల్లో భారత నావికా దళం, భారత రైల్వేలకు ప్రాతినిధ్యం వహించారు. అతను 59 కిలోలు, 56 కిలోల విభాగాల్లో మైలు రాళ్లను ఆవిష్కరించారు.

1981లో ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగిన మినీ కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకాన్ని, 1982లో ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగిన కామన్వెల్త్ గేమ్స్‌లో బాంటమ్ వెయిట్ విభాగంలో మొత్తం 227.5 కిలోల బరువును ఎత్తి రజత పతకాన్ని సాధించాడు. అతను నగోయా (1981), డమాస్కస్ (1983) ఆసియా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో ఒక్కో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. 1982లో పెషావర్‌లో జరిగిన పాకిస్తాన్ జాతీయ క్రీడలలో బంగారు పతకాన్ని సాధించారు. 1982 సంవత్సరం ఆగస్టు 19న న్యూఢిల్లీలో అధ్యక్షుడు జ్ఞానీ జైల్ సింగ్ చేతుల మీదుగా అర్జున పురస్కారం అందుకున్నారు. గత ఏడాది క్రీడా రంగంలో బిజూ పట్నాయక్ క్రీడా సాఫల్యం పురస్కారం పొందారు. భారత నావికాదళంలో పదేళ్లు గార్డుగా రైల్వే శాఖలో 1985 నుంచి 2009 వరకు పని చేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు.

గవర్నరు సంతాపం

వెయిట్ లిఫ్టింగ్ రంగంలో ఆయన సాధించిన విజయాలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉంటాయని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. ఆయన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, క్రీడలు, యువజన వ్యవహారాల విభాగం మంత్రి సూర్యవంశీ సూరజ్, విపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తదితర ప్రముఖులు విజయ్ కుమార్ శత్పతి మృతిపై సంతాపం ప్రకటించారు.

మరుగుదొడ్లు శుభ్రపరిచి నిరసన

కొరాపుట్:

నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని డయాలసిస్ వార్డులో గత కొన్ని నెలలుగా మరుగుదొడ్లు శుభ్రపరచడం లేదని మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జి వినూత్నంగా మంగళవారం నిరసన తెలిపారు. ఇక్కడ పారిశుద్ధ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తున్నప్పటికీ రోగులకు ఉత్తమ సేవలు అందడం లేదని ఇటీవల కాలంలో ఫిర్యాదులు పెరిగాయి. దీంతో ప్రతిపక్ష బీజేడీకి చెందిన కార్యకర్తలతో కలిసి ఆస్పత్రికి ఆయన చేరుకున్నారు. అక్కడ దుర్గంధం వెలువడుతున్న మరుగుదొడ్లను శుభ్ర పరిచారు. అతనితో పాటు వచ్చిన మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని కూడా మరో గదిని శుభ్రపరిచారు. ఈవిధంగానైనా ప్రభుత్వంలో చలనం వస్తుందని ఆశించారు. మరోవైపు వైద్యశాఖ ఉన్నతాధికారులు మాత్రం ప్రతిరోజూ ఆస్పత్రిలో మరుగుదొడ్లు శుభ్రపరుస్తున్నామని ప్రకటించారు.



మరుగుదొడ్డి శుభ్రపరుస్తున్న మాజీ ఎంపీ ప్రదీప్ మఝి

ఆధ్యాత్మిక శోభ



పర్లాకిమిడి: తెలుగు చాకలివీధి వద్ద మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారు



పర్లాకిమిడి: అంకావీధిలో బాలత్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు



రాయగడ: గాయత్రీ మాత రూపంలో లక్ష్మీ అమ్మవారు

రాయగడ: దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీంతో పట్టణాలు, గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం గాయత్రిమాత రూపంవో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. రాయగడలోని కస్తూరీనగర్‌లో ఉన్న సత్యనారాయణ స్వామి మందిరంలో కొలువైఉన్న లక్ష్మీ అమ్మవారిని శరన్నవరాత్రుల్లో భాగంగా గాయత్రిమాత రూపంలో అలంకరించారు. అలాగే మజ్జిగౌరి అమ్మవారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించగా.. అధికసంఖ్యలో భక్తులను అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

-పర్లాకిమిడి: పర్లాకిమిడి పట్టణంలోని దేవీ మండపాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ రూపాయల్లో దర్శనమించిన అమ్మవారిని చూడటానికి భక్తులు ఆసక్తి కనబరుస్తున్నారు. స్థానిక పెద్ద బ్రాహ్మణ వీధిలో 60 ఏళ్లుగా కొనసాగుతున్న దేవీ నవరాత్రులు మంగళవారం అమ్మవారు భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే తెలుగు చాకలివీధిలో కూడా అత్యంత దేదీప్యమానంగా మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనం కల్పించారు. స్టేట్ బ్యాంకు దిగువ తలుపులమ్మ తల్లికి సాయంత్రం వేళ మహిళలు దీపారాధన చేస్తున్నారు. పట్టణంలో అన్ని దేవీ మండపాలు, దుర్గా పెండాళ్లు విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. మరికొన్ని దుర్గాపెండాళ్లు అష్టమి రోజున ప్రారంభమవుతున్నాయి.

కొరాపుట్: బొరిగుమ్మ పట్టణంలో తెలుగు మహిళలచే నవరాత్రి ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళవారం కొరాపుట్ జిలా బొరిగుమ్మ పటణంలోని మెయిన్ రోడ్డు గుండిచా మందిరంలో గాయత్రి దేవిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక హోమాలు, ప్రసాద సేవనం జరిగింది. గ్రామ పురోహితులు కిరణ్ పంతులు, దీక్షిత్ శర్మ నేతృత్వంలో పూజలు జరగ్గా.. స్వర్ణాంజలి మహిళా గ్రూప్ సభ్యులు సహకరించారు.



పర్లాకిమిడి: పెద్దబ్రాహ్మణ వీధి జంక్షన్ వద్ద..



పర్లాకిమిడి: స్టేట్‌బ్యాంక్ దిగువ వీధిలో పూజలందుకుంటున్న తలుపులమ్మ తల్లి



కొరాపుట్: బొరిగుమ్మలో ప్రత్యేక పూజలు చేస్తున్న తెలుగు ప్రజలు

క్లుప్తంగా

నేడు కబడ్డీ ఎంపికలు

ఎచ్చెర్ల: కర్ణాటక రాష్ట్రం బెల్గావిలో అక్టోబర్ 4 నుంచి నిర్వహించనున్న సౌత్‌జోన్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనే వర్సిటీ జట్టు ఎంపికలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఆసక్తి గల వర్సిటీ, అనుబంధ కళాశాలల క్రీడాకారులు వర్సిటీ ఆవరణలో జరిగే ఎంపికలకు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

నేడు జిల్లాస్థాయి సెపక్‌తక్ర జట్ల ఎంపికలు



సాధన చేస్తున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సెపక్‌తక్ర జట్ల ఎంపికలు ఈ నెల 24న జరుగుతాయని సంఘ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా బుధవారం సాయంత్రం 4 గంటలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతుందని చెప్పారు. విజేతలు సెపక్‌తక్ర జిల్లా సెక్రటరీ జి.అర్జున్‌రావురెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలు వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్–2025 పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వివరాలకు 9949291288 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వార్షిక క్రీడా షెడ్యూల్‌కు ఆమోదం



మాట్లాడుతున్న వీసీ కె.ఆర్.రజనీ

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన క్రీడా కార్యక్రమాలపై మంగళవారం స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో చర్చించారు. వార్షిక క్రీడా షెడ్యూల్‌కు ఆమోదం తెలిపారు. పీఎం–ఉషా నిధులు ఉపయోగించుకుని క్రీడా సంబంధిత అంశాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ కె.ఆర్ రజనీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రా యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం బీఓఎస్ చైర్మన్ ఎన్.విజయమోహన్, బీఆర్ఏయూ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఉదయభాస్కర్, ఎస్‌వో సామ్రాజ్యలక్ష్మీ, పి.రవికుమార్, పీడీలు ఎం.శ్రీనివాసరావు, వి.భాస్కర్, ఎస్.లోకేశ్వరి, టి.సంతోష్, పావని, అనుబంధ కళాశాలల పీడీలు పాల్గొన్నారు.

పీజీ సెట్ ప్రవేశాల సీట్లు జాబితా విడుదల

ఎచ్చెర్ల : ఏపీ పీజీ సెట్–2025 ప్రవేశాలకు సంబంధించి సీట్లు, కళాశాలల జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ పీజీ కళాశాలల్లో సీట్లు భర్తీకి ఈ ఏడాది జూన్ 9 నుంచి 12 వరకూ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 20 వరకూ కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాల జాబితా విడుదల చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 23 నుంచి 27 వరకూ ఆయా వర్సిటీలు, కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 28 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. వర్సిటీలో తొమ్మిది సైన్స్, పది ఆర్ట్స్ కోర్సుల్లో మొత్తం 600 సీట్లు ఉండగా 252 సీట్లు భర్తీ అయ్యాయి. కొత్తగా ప్రారంభించిన జియోఫిజిక్స్, జియాలజీ కోర్సులతో పాటు ఎంజేఎంసీలో ఎవరూ చేరలేదు. ఫిలాసఫీలో ఒక్కరు మాత్రమే చేరారు.

బీఆర్‌యూలో ప్రవేశాలు ఇలా..

కోర్సు	మొత్తం సీట్లు	భర్తీ సీట్లు
ఎంఏ ఫిలాసఫీ	20	1
జియోఫిజిక్స్	15	0
జియాలజీ	15	0
ఎంజేఎంసీ	30	0
సోషల్‌వర్క్	40	04
అర్థశాస్త్రం	40	08
ఎంఎల్ఐఎస్‌సీ	40	08
రూరల్ డెవలప్‌మెంట్	40	11
ఎం.కాం	40	27
ఆంగ్లం	40	24
తెలుగు	40	16
ఎంఈడీ	40	17
బయోటెక్నాలజీ	30	29
మైక్రో బయాలజీ	20	21
ఆర్గానిక్ కెమిస్ట్రీ	30	31
ఎనలాటికల్ కెమిస్ట్రీ	20	20
గణితం	40	14
అప్లయిడ్ మ్యాథ్స్	20	11
భౌతిక శాస్త్రం	40	15

బకాయి వేతనాల కోసం ధర్నా



బొయిపరిగుడ సమితి కార్యాలయం ముంగిట ధర్నా జరుపుతున్న జీపీఎస్‌ఎఫ్ ఉద్యోగులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడలో తమకు బకాయి ఉన్న ఆరునెలల వేతనాలను చెల్లించాలని జీపీఎల్‌ఎఫ్ ఉద్యోగులు సమితి కార్యాలయం ముంగిట నిరవధిక ధర్నా చేస్తున్నారు. ఒడిశా జీపీఎల్‌ఎఫ్ ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు బొయిపరిగుడ సమితిలో గల జీపీఎల్‌ఎఫ్ ఉద్యోగులు బీడీఓ కార్యాలయం ముంగిట నిరవధిక ధర్నా చేశారు. ఆరు నెలల నుంచి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. 15వ తేదీన మరోమారు డిమాండ్లు తెలిపినా నేటి వరకు పట్టించుకోలేదని అందుకే ధర్నాకు దిగామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు సమితి కార్యాలయంలో గల జీవికా మిషన్ కార్యాలయానికి తాళాలు వేశారు.

సీనియర్ సిటిజన్ దినోత్సవానికి సన్నాహాలు



హాజరైన సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు

జయపురం: అక్టోబర్ ఒకటో తేదీన సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు స్థానిక సీనియర్ సిటిజన్స్ కమిటీ సొంత భవనంలో కమిటీ సభ్యులు బినోదినీ సొంత అధ్యక్షతన నిర్వహించిన కమిటీ సమావేశంలో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరమ్ శౌశ్యా రెడ్డి, గౌరవ అతిథులుగా జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతిలను ఆహ్వానించాలని నిర్ణయించారు. సీనియర్ సిటిజన్స్ దినోత్సవ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్‌లలో ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులను సన్మానించాలని సమావేశం నిర్ణయించింది. కమిటీ కార్యదర్శి జి.వెంకట రెడ్డి, కోశాధికారి రబినారాయణ నందో, సలహాదారు మీణకేతన దాస్, ఇంజినీర్ కేదార్ నాథ్ బెహర, నరశింహ చౌదరి పాల్గొన్నారు.

ఖోజురిపదలో ఆత్మనిర్భర్‌పై వర్క్‌షాపు



వర్క్‌షాపులో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

పర్లాకిమిడి: ఆత్మనిర్భర భారత్‌పై బీజేపీ శ్రేణులు గజపతి జిల్లా మోహానా నియోజకవర్గం నువాగడ బ్లాక్‌లో ఖోజురిపద వద్ద మంగళవారం కర్మశాలను నిర్వహించారు. ఈ కర్మశాలకు దక్షిణ మండలం ప్రభారి (ఆత్మనిర్భర్) సుజాతా పాడీ ముఖ్యఅతిథిగా విచ్చేయగా, ఇతర అతిథులుగా జిల్లా బీజేపీ అధ్యక్షులు నబకిశోర్ శోబోరో, జిలా కోఆర్డినేటరు ఇ.ప్రశాంత్ పాల్గొన్నారు.

మావోల డంప్ స్వాధీనం



డంప్‌ను తీస్తున్న దృశ్యం



జవాన్లు స్వాధీనం చేసుకున్న డంప్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి బెజాంగ్‌వాడ పంచాయతీ ఎల్కనూరు గ్రామ అడవిలో మంగళవారం మావో డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. జవాన్లు ఇచ్చిన ముందస్తు సమాచారంతో మల్కన్‌గిరి డీవీఎఫ్ జవాన్లు, బీఎస్‌ఎఫ్ జవాన్లు సంయుక్తంగా మంగళవారం ఉదయం కూంబింగ్‌కు వెళ్లారు. అయితే వారికి బెజాంగ్ వాడ పంచాయతీ అడవి మార్గంలో ఎల్కనూరు గ్రామం గ్రామంలోని అడవిలో మావోలు దాచిన డంప్‌ను గుర్తించి వెలికి తీశారు. అందులో టిఫిన్ బాంబు, జిలెటిన్ స్టిక్స్, ఎలక్ట్రిక్ డిటోనేటర్ తదితర సామగ్రి ఉన్నాయి.

అక్రమ గ్రావెల్ నీ స్కూల్ దగ్గర లేదంటే..
నేను రాజకీయాలు వదిలేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

- బీజేపీ ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌కు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్ సవాల్
- యూబీ పరిశ్రమ ద్వారా నెలకు రూ.70 లక్షలు దోపిడీ వాస్తవం కాదా అని నిలదీత
- ఎచ్చెర్ల పరువు ప్రతిష్టలను దిగజార్చారని ధ్వజం

రణస్థలం: బీజేపీ ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తన ఇంటికి, స్కూల్‌కి మధ్యలో వేసుకున్న వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమం కాదంటే తాను రాజకీయాలు వదిలేస్తానని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సవాల్ విసిరారు. ఎచ్చెర్ల వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్ఈఆర్ అసెంబ్లీకే మచ్చ తెచ్చేలా మాట్లాడారని, ప్రజా సమస్యలు ప్రస్తావించాల్సిన జీరో అవర్‌లో తన వ్యక్తిగత సమస్యలను ప్రస్తావించి నియోజకవర్గం పరువు దిగజార్చారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రావెల్ గొడవలు జరుగుతున్నాయని, పక్కా అనుమతులు ఉన్న వారిపై కక్ష కట్టి కోట్లాది రూపాయల ఫైన్ వేయించారని ఆరోపించారు. హైవే పనులకు అక్రమంగా గ్రావెల్ విక్రయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. లీజుదారుల నుంచి కొనుగోలు చేద్దామంటే ఎమ్మెల్యే ఒప్పుకోవడం లేదని హైవే ఉద్యోగులే చెబుతున్నారని తెలిపారు.

పరిశ్రమలకు బెదిరింపులు

'పైడిభీమవరంలోని శర్వాణి కాంక్రీట్ ప్లాంట్ యాజమానులను బెదిరించి ఎన్ఈఆర్ స్కూల్‌కు శ్లాబ్‌కు రూ.15 లక్షల విలువ గల కాంక్రీట్ ఉచితంగా వేయమన్నావ్. వినకపోతే అధికారులను పంపించి యాజమాన్యాన్ని బెదిరించారు. అప్పటికీ వినకపోతే అధికంగా పన్నులు వేయించావు. వాళ్లు గట్టి వాళ్లు కాబట్టే నీ బెదిరింపులకు లొంగలేదు. ఇలాంటి అరాచకాలు బయట పెడుతున్న మీడియా, పత్రికల పైనా కేసు పెడుతున్నారు' అని కిరణ్‌కుమార్ మండిపడ్డారు.

యూబీ పరిశ్రమలో ముప్పై ఏళ్లుగా పని చేస్తున్న 70 మంది కార్మికులను తొలగించారని, వైఎస్సార్‌సీపీ అనుకూలంగా ఉన్నారని కార్మికుల ఉద్యోగాలు తీసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా అనుమతులు పొందిన లేబర్, రవాణా కాంట్రాక్టర్లను పంపించేసి తనకు అనుకులమైన వాళ్ల పేర్లతో పనులు చేయిస్తున్నారని, ఈ పనులన్నీ యూబీ హెచ్ఆర్ కృష్ణంరాజు అనే వ్యక్తి ద్వారా నడిపిస్తున్నారని తెలిపారు. లారీలు ట్రాన్స్‌పోర్ట్ చేసే కాంట్రాక్టర్లను బెదిరించి తన ట్రాన్స్‌పోర్టు లారీలను పెడుతున్నారని, ఇలా నెలకు రూ.70 లక్షలు పైచిలుకు దోచుకుంటున్నారని ఆరోపించారు. తప్పుడు పనులు చేసి భగవంతుడి మీద ప్రమాణాలు చేయకూడదన్నారు. ఎన్‌హెచ్–16లో భాగంగా చేస్తున్న ఫ్లై ఓవర్ హైవే కాంట్రాక్టులన్నీ ఆయనే చేస్తున్నారని, రోలర్, లారీ, ట్రాక్టర్లు అన్నీ అతనివే పెడుతున్నారని, లేదంటే హైవే కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని తెలిపారు. తమ నియోజకవర్గాన్ని తాము కాపాడుకుంటామని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, నాయకులు మీసాల వెంకటరమణ, డోల వెంకటరమణ, రొక్కం బాలకృష్ణ, మీసాల సీతంనాయుడు, దన్నాన రాజీనాయుడు, బొర సాయిరామ్, బవిరి రమణ, టేకు బ్రహ్మాజీ, ముద్దాడ రాజశేఖర్, కుప్ప రమణ, గొర్లె రామునాయుడు, గోవిందాసు సాయి తదితరులు ఉన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి యావజ్జీవం



నిందితునికి శిక్ష విధించిన కోర్టు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ పోలీసు స్టేషన్ పరిధిలో 2024లో ఒక ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితునికి జయపురం స్వతంత్ర పోస్కో కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ కేసును విచారించిన స్వతంత్ర పోస్కో కోర్టు జడ్జి 17 మంది సాక్షులను విచారించి, 24 రికార్డులను పరిశీలించి కుసుమి గ్రామం వాసి ముద్దాయి నరశింగ భూమియ(30)కు యావజ్జీవ కారాగార శిక్ష విధించినట్లు పోస్కో కోర్టు ప్రత్యేక పీపీ డాక్టర్ గాయిత్రి దేవి వెల్లడించారు. కారాగార శిక్షతో పాటు రూ.31 వేల జరిమానా విధించారని, చెల్లించకుంటే మరో 13నెలలు జైలు శిక్ష అనుభవించాలని కోర్టు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ వారు బాధితురాలైన శిశువుకు మరో రూ.6 లక్షలు పరిహారం అందజేయాలని కోర్టు ఆదేశించింది. 2024 మే నెల 24వ తేదీన 5 యేళ్ల బాలిక తన అక్కతో పాటు ఆడుకుంటూ ఉండగా నరశింగ ఐస్‌క్రీమ్ కొని ఇస్తానని చెప్పి బాలికను ఒక పాడైన ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తర్వాత బాలికను తీసుకు వచ్చి రోడ్డుపై విడిచి వెళ్లిపోయాడు. ఈ విషయం బాలిక తన తల్లికి తెలిపింది. ఆ మరునాడు బాలిక తల్లి కోట్‌పాడ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నిందితుని అరెస్టు చేసి కోర్టుకు పంపి చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

ఆవుదూడపై వీధికుక్కల దాడి



కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆవుదూడ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. మంగళవారం ఆవు దూడపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. బొరిగుమ్మ అయోధ్యనగర్ ప్రాంతంలో మున్న రథ్ ఇంటి ఆవరణలో ఉన్న దూడపై కుక్కలు దాడి చేయగా.. అరుపులు విని యజమాని మున్న రథ్ వెంటనే వచ్చి దూడను రక్షించాడు. ఆవును, దూడను పశువైద్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బొరిగుమ్మ పట్టణంలో కుక్కల బారినుంచి ప్రజలు, పశువులకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరారు.

బీజేడీ నుంచి శ్రీమయి మిశ్రా సస్పెన్షన్



భువనేశ్వర్: బిజూ జనతా దళ్‌లో ముందంజ మహిళా నాయకురాలుగా వెలుగొందిన శ్రీమయి మిశ్రాను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఆమె పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఆరోపణ కింద సస్పెన్షన్‌కు అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆమోదించడంతో మంగళవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె బీజేడీ మహిళా శాఖ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఆమె సోషల్ మీడియాలో పార్టీలో కొంత మంది ప్రముఖుల్ని ఉద్దేశించి ధృతరాష్ట్ర, సన్నాసి వంటి పదజాలంతో వ్యంగ్య వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది.

అప్రెంటిషిప్‌కు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పరిధిలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు (డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లు) ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం 'అప్రెంటిస్‌షిప్‌ఇండియా.జీవోవి.ఇన్' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రజారవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ మంగళవారం తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు అక్టోబరు 16న ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా వి.టి.అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు. ఇప్పటికే అప్రెంటిప్ పూర్తి చేసిన అభ్యర్థులు అనర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 08922–294906 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సభ వాయిదా

భువనేశ్వర్: విపక్షాలు బిజూ జనతా దళ్, కాంగ్రెస్ సభ్యులు నిరసన హోరుతో మంగళవారం సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షాల గర్జనల మధ్య ప్రశ్నోత్తరాలు కాసేపు కొనసాగాయి. ప్రశ్నోత్తరాల ప్రారంభం నుంచి ప్రతిపక్షాల గర్జనతో సభ దద్దరిల్లింది. పంచాయతీ రాజ్ వ్యవస్థ అంశంపై బీజేడీ సభ మధ్యలోకి వచ్చి నిరసన వ్యక్తం చేసింది. అవిశ్వాస తీర్మానం అంశంపై కాంగ్రెస్ సభ్యులు తమ స్థానంలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. గందరగోళం మధ్య సభ ముందుకు సాగలేదు. అతి కష్టం మీద 20 నిమిషాల పాటు ప్రశ్నోత్తరాలు కొనసాగాయి. ఈ పరిస్థితుల్లో స్పీకర్ సురమా పాడి సభను సాయంత్రం 4 గంటల వరకు వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఆ తర్వాత కూడ సభలో పరిస్థితి కుదుట పడలేదు. పంచాయితీ రాజ్ వ్యవస్థ అధికారాల కుదింపు చర్య పట్ల నిరసనతో ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ సభ నుంచి బయటకు వెళ్లి గాంధీ బొమ్మ దగ్గర బైఠాయించి నిరసన ప్రదర్శించింది. విపక్ష సభ్యుల గందరగోళం మధ్య బీజేడీ ఆందోళనతో సభ సజావుగా సాగడం లేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. విశ్వ విద్యాలయ సవరణ బిల్లు 2025ని ఆమోదించినట్లు ప్రకటించి సభా కార్యకలాపాల్ని బుధవారం ఉదయం 10.30 గంటల వరకు నరవధికంగా వాయిదా వేసినట్లు స్పీకరు ప్రకటించారు.



సభలో ప్రభుత్వ వ్యతిరేక నినాదం పతాకంతో బీజేడీ సభ్యుల నిరసన ప్రదర్శన

మోసం కేసులో మహిళా కానిస్టేబుల్ అరెస్టు



అరెస్టయిన కానిస్టేబుల్ బాసంతి బిశ్వాస్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లాలో వ్యాపారం పేరుతో ఓ వ్యక్తిని మోసం చేసి డబ్బులు దోపిడీ చేసిన కేసులో మహిళా కానిస్టేబుల్‌తో పాటు ముగ్గురిని మంగళవారం అరెస్టు చేశారు. జిల్లాలోని బలిమెల ప్రాంతానికి చెందిన సుల్తాన్ సింగ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజు షేక్, కడపకు చెందిన రఘు నరసింహ అనే వ్యక్తిని ఫోన్ ద్వారా మోసం చేశారు. శివ అనే పరిచయస్తుడి పేరుతో మల్కన్‌గిరిలో వ్యాపారం పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి రఘు నరసింహను మల్కన్‌గిరికి పిలిచి ఓ హొటల్‌లో ఉంచి శివ, సుల్తాన్, రాజు అనే ముగ్గురు వచ్చి వ్యాపారంపై చర్చించి ఎంవీ 17 గ్రామం వద్దకు తీసుకుని వెళ్లి అక్కడ నరసింహపై దాడి చేసి ఫోన్ తీసుకుని రూ.82వేలు అకౌంట్ నుంచి తీసుకున్నారు. ముందు హొటల్‌లో రూ.3 లక్షలు తీసుకున్నారు. వీరికి ఓ మహిళా కానిస్టేబుల్ బాసంతి బిశ్వాస్ సహకరించింది. అక్కడి నుంచి ఆయనను మరో హొటల్‌కు తెచ్చి మరో రెండు రోజులు ఉంచి ఓ అడవికి తీసుకెళ్లి రూ.3 లక్షలు ఇస్తే వదిలేస్తామని హెచ్చరించారు. నరసింహ కారు రహదారిపై ఉండడంతో గ్రామస్తులు అనుమానించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయాలన్నీ బయటకు వచ్చాయి. దీంతో ఈ నలుగురిని మంగళవారం అరెస్టు చేశారు. గతంలో కూడా బాసంతిపై కేసులు ఉండడం గమనార్హం.

1837 కిలోల గంజాయి ధ్వంసం



గంజాయిని ధ్వంసం చేస్తున్న దృశ్యం



సాధీనం చేసుకున్న గంజాయి

రాయగడ: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పరిధిలో సిబ్బంది దాడులను నిర్వహించి స్వాధీనం చేసుకున్న 1837 కిలోల గంజాయిని జిల్లా పోలీస్ యంత్రాంగం మంగళవారం ధ్వంసం చేసింది. ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ ఆధ్వర్యంలో డ్రగ్ డిస్పోజల్ కమిటీ ద్వారా పట్టణానికి సమీపంలోని తెరువలి వద్ద గల ఇండియన్ మెటల్స్ అండ్ ఫెర్రో ఎల్లాయిస్ (ఇంఫా) కర్మాగారంలో గంజాయిని అందరి సమక్షంలో పరివేక్షించిన అనంతరం ధ్వంసం చేశారు.

కలెక్టర్ చొరవతో బాలుడికి ఆపరేషన్



శస్త్రచికిత్స నిమిత్తం కటక్ బయలుదేరిన బాలుడు అనురాగ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ సోమేశ్ ఉపాధ్యాయ్ చొరవతో కటక్ ఎస్ఎస్‌బీ మెడికల్‌లో పోలియో వ్యాధితో బాధపడుతున్న బాలుడుకి శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోరుకొండ సమితిలో ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో తమసా పంచాయతీ తండాపల్లి గ్రామానికి చెందిన అనురాగ్ మడ్కమి (7) బాబునితి తీసుకొని తల్లిదండ్రులు హాజరయ్యారు. ఎడమకాలు చిన్నప్పటి నుంచి వంకర తిరిగి ఉందని కలెక్టర్ దృష్టికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. పరిశీలించిన కలెక్టర్ జాతీయ బాలసురక్షా పథకంలో బాలుడికి పూర్తి చికిత్స చేయించాలని ఆదేశించారు. వెంటనే ఆరోగ్యశాఖ ఫార్మసిస్ట్ రంజన్ కుమార్ భయాన్ సహయంతో అనురాగ్‌ను కటక్‌కు పంపించారు. మంగళవారం బాలుడికి ఆపరేషన్‌ను విజయవంతంగా వైద్యులు పూర్తి చేశారు. కలెక్టర్‌కు బాలుడు అనురాగ్ తండ్రి ముక మడ్కమి ఫోన్ చేసి తన బిడ్డకు కొత్త జీవితాన్ని ప్రసాదించారని సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

డెమో.. వామ్మో!



- అక్రమాలకు వెనక్కి తగ్గేది లేదంటూ చర్యలు
- లేనివి ఉన్నట్టుగా సర్టిఫికేషన్లు జారీ
- తద్వారా భారీగా లోన్లు పెట్టుకునేలా ఒప్పందాలు
- వాటాల మయంగా జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలోని కీలక విభాగాల్లో కొందరు అధికారుల తీరు విస్తు గొలుపుతోంది. ముఖ్యంగా డిస్ట్రిక్ట్ ఎక్స్‌టెన్షన్ మాస్ మీడియా విభాగం (డెమో)లో ఓ అధికారి వ్యవహరిస్తున్న తీరు, ఆయనకు వత్తాసు పలుకుతూ తన వాటా డోస్‌ను పెంచుకుంటున్న కీలక అధికారి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వివిధ రకాల ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌ను సర్టిఫికేషన్ విషయంలో రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్న డెమో విభాగ ప్రముఖులు ఇందులో వాటాగా కీలక అధికారికి కూడా ఎంతో కొంత ఇస్తూ ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా విధులు నిర్వర్తిస్తూ వస్తున్నారు. అయితే ఇంకో కోణంలో ఈ విభాగాధికారులు చేస్తున్న అక్రమాలు చూస్తే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. ఉన్నవి లేనట్లుగా లేనివి ఉన్నట్లుగా చూపించి బ్యాంకు అధికారులకు కూడా టోపీ పెట్టేలా ఈ డెమో విభాగ ప్రతినిధులు స్కెచ్ వేసి అంతా సక్సెస్ అయ్యాక వాటాల బేరాలకు తెర తీస్తున్నారు. తప్పులకు దన్నుగా ఉన్నందుకు కీలక అధికారికి కూడా వాటాను కేటాయించడంతో ఏ మాత్రం వ్యవహారం బయటకు రాకుండా అక్రమాలు కొనసాగుతున్నాయి.

లోన్లు కోసం లేని పరికరాలు ఉన్నట్లుగా..

జిల్లాలో చాలా మంది వైద్య వ్యాపారంలో భాగంగా ప్రైవేటు ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, వివిధ సామర్థ్యాలతో నర్సింగ్ హోమ్‌లను ప్రారంభిస్తున్నారు. గత ఐదారేళ్లుగా జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో ప్రైవేటు సంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులు నెలకొల్పారు. అయితే వీటిని ప్రతి మూడు నెలలకు, ఆరునెలలకు తనిఖీల పేరిట ఒక్కో ప్రోగ్రాం ఆఫీసర్‌తో కలిసి బృందంగా డెమో విభాగం వెళ్లి ప్రభుత్వ రుసుంతో పాటు తమ జేబులు కూడా నింపుకుంటూ వస్తున్నారు. ఎక్కడైనా మాట వినని పరిస్థితి ఎదురైతే నెగెటివ్ రిపోర్టు రాసేలా చర్యలుంటాయి. కేవలం బ్యాంకు రుణాలకు గాను కొందరు ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తే వారికి అనుకూలంగా అన్ని పరికరాలు, ఇన్‌ఫ్రాస్టక్చర్ ఉన్నట్టుగా సర్టిఫికేషన్ చేసి ఆ పార్టీ నుంచి రూ.లక్షల్లో దోచేస్తున్నారు. ఇటీవలే జిల్లా కేంద్రంలోని ఓ ల్యాబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లుగా అందులో ఆధునిక పరికరాలున్నట్లుగా (వేరే ప్రముఖ క్లినిక్‌ల ఫొటోల ఆధారాలతో) సర్టిఫికేషన్ చేసేసి బ్యాంకు రుణాలకు సహకరిస్తున్నారనే చర్చ సాగుతోంది. కానీ ఆ ఏరియాలో ఆ పేరుతో ఎలాంటి ల్యాబ్ గానీ స్కానింగ్ సెంటర్ గానీ లేదు. బ్యాంకులను సైతం తప్పుదోవ పట్టించి సుమారు రూ.50 లక్షలకు మించి రుణాలకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇటీవల జిల్లాలో నాలుగైదు ప్రైవేటు ల్యాబుల నుంచి పలు బ్యాంకులకు రుణాలిప్పించే బాధ్యతలను కూడా ఈ విభాగమే తీసుకుందనే చర్చ జోరందుకుంది. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు చేస్తే మరిన్ని అక్రమ వ్యవహారాలు బయటకు వచ్చే అవకాశాలున్నాయని వైద్య శాఖలో చర్చ సాగుతోంది.

క్లుప్తంగా

ముగ్గురిపై చెట్లు నరికివేత కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో అక్రమంగా మామిడితోటను నరికి వేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. తమ సాగులో 30 సంవత్సరాలుగా ఉన్న మామిడితోటను దేవుపల్లి గ్రామానికి చెందిన వెన్నెల రాము నాయుడు, ఇట్లా తిరుపతిరావు, విశాఖకు చెందిన పైల నటరాజులు నరికి వేసినట్లు ముదూనూరు సన్యాసిరాజు, చేకూరి సూర్యకాంతం ఇచ్చిన ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు రిఫరీగా అజయ్‌కుమార్



రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న పి.అజయ్‌కుమార్ జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు చీఫ్ రిఫరీగా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి వై.రాజారావు నుంచి ఉత్తర్వులు వచ్చాయని అజయ్‌కుమార్ తెలిపారు. ఈపోటీలు తమిళనాడులోని దిండిగల్‌లో 71వ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్, 44వ సబ్ జూనియర్ పోటీలు ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్నారన్నారు. ఈ పోటీలకు తనను ఆంధ్రప్రదేశ్ నుంచి డిప్యూటీ చీఫ్ రిఫరీహోదాలో నియమించారని తెలిపారు. అయితే రెండు పోటీలు ఒకేసారి జరగడంతో సబ్ జూనియర్ జాతీయ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు చీఫ్ రిఫరీగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. తాను ఇప్పటి వరకు 53 జాతీయ పోటీల్లో పాల్గొన్నానని తెలిపారు. ఆయన నియామకంపట్ల హెచ్‌ఎం గురుమూర్తి, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు, గ్రామస్తులు, పీడీలు, ఉపాధ్యాయులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

నదిలో కొట్టుకుపోయిన పశువుల కాపరి

మెంటాడ: మెంటాడకు చెందిన పశువుల కాపరి చల్లకృష్ణ(45) పశువులకు మేత కోసం మధ్యాహ్నం చంపావతి నదిదాటి ఆగురు గ్రామం వైపు తోలుకువెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి తిరిగి ఇంటికి పశువులను తోలుకుని వస్తుండగా వర్షానికి నది ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. నది దాటే సమయంలో నీటి ప్రవాహానికి నదిలో కొట్టుకు పోయాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, గ్రామస్తులు నదిలో గాలిస్తున్నారు.

బస్సులో ఆగిన గుండె



మృతిచెందిన కండక్టర్ ఈశ్వరరావు

శృంగవరపుకోట: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ ఉద్యోగి అదే బస్సులో తుదిశ్వాస విడిచాడు. స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఈశ్వరరావు మంగళవారం ఉదయం విశాఖ –కించుమండ సర్వీస్‌కు కండక్టర్‌గా వెళ్లారు. విశాఖ నుంచి ఎస్.కోట వస్తుండగా మధ్యాహ్నం 12.30గంటల సమయంలో బస్సు పెందుర్తి- సరిపల్లి మధ్య ఉండగా కండక్టర్ ఈశ్వరరావు సీటులోనే గుండె పట్టుకుని కూలిపోయారు. ఆయనను గమనించిన ప్రయాణికులు డ్రైవర్‌కు చెప్పడంతో బస్సు ఆపిన డ్రైవర్ హుటాహుటిన పెందుర్తి పీహెచ్‌సీకి కండక్టర్‌ను తరలించారు. కండక్టర్ ఈశ్వరరావును పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు ధ్రువీకరించారు. దీంతో ఆర్టీసీ యాజమాన్యం కండక్టర్ మృతదేహాన్ని ఎస్.కోట తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈశ్వరరావు పార్థివదేహాన్ని గంట్యాడ మండలంలో సొంత గ్రామమైన వసంతకు తరలించారు. మృతుడు ఈశ్వరరావుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

అప్రమత్తత అవసరం

విజయనగరం ఫోర్ట్: మందులను భద్రపరచడంలో అప్రమత్తత అవసరమని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ అల్లు పద్మజ అన్నారు. మంగళవారం స్థానిక సర్వజన ఆస్పత్రిలోని ఓపీ, ఫార్మసీ విభాగాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వ్యాక్సిన్లు భద్రపరచడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ ఫార్మాసిస్ట్ బి. నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రామస్వామి ఆలయంలో వేకువ జామున ప్రాతఃకాలార్చన, బాలభోగం చేపట్టారు. అనంతరం సీతారాముల నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేంకటేశ్వర స్వామి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాల అనంతరం వైదిక సిబ్బంది బ్రహ్మోత్సవాలకు ఘనంగా అంకురార్పణ చేశారు. బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.





ఆన్‌లైన్‌లో మునిగి తేలుతున్న చిన్నారులు

● తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిందే

ఆనందం మాటున ప్రమాదాలు

విజయనగరం గంటస్తంభం:

సెలవులు అనగానే పిల్లలకు అపారమైన ఆనందం కలుగుతుంది. అయితే ఈ సమయంలో కాలక్షేపం పేరుతో చేసే పనులు అనుకోని ప్రమాదాలకు దారితీస్తున్నాయి. పిల్లలకు సెలవుల్లో ఖాళీ సమయం ఎక్కువగా దొరకడంతో తల్లిదండ్రుల పర్యవేక్షణ మరింత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, కాలువలు నీటితో నిండిపోయాయి. ఈత రాని పిల్లలు సరదాగా వాటిలోకి దూకి ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు సంభవిస్తున్నాయి. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు పిల్లలకు జాగ్రత్తలు చెప్పి, పెద్దవారి తోడుతోనే నీటి వనరులకు వెళ్లాలని సూచించాలి. అలాగే అనుమతి లేకుండా పిల్లలు ఇంట్లో వాహనాలు తీసుకుని రోడ్లపైకి రావడం, అర్ధరాత్రి లాంగ్ డ్రైవ్స్ చేయడం ప్రమాదకరమవుతోంది. అధిక వేగం, నిర్లక్ష్యం ప్రాణాంతక ఫలితాలకు దారితీస్తోంది. కనుక వాహనాలు పిల్లల చేతికి ఇవ్వకపోవడమే శ్రేయస్కరమని అధికారులు సూచిస్తున్నారు. డిజిటల్ యుగంలో పిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు గుర్తించాలి. సోషల్ మీడియా, గేమ్స్, అనవసర యాప్‌లలో మునిగిపోవడం వారి భవిష్యత్తుకు ముప్పు తెస్తోంది. అవసరమైనప్పుడు మాత్రమే మొబైల్ వినియోగానికి పరిమితం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇక జిల్లాలో మైనర్లు మత్తు పదార్థాల బారినపడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.సరదాగా మొదలైన అలవాటు డ్రగ్స్, గంజాయి, సిగరెట్ వైపు మళ్లిస్తోంది. అందు వల్ల సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు కన్నేయడం అత్యంత కీలకమని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తల్లిదండ్రులు స్నేహితుల్లా వ్యవహరించాలి

తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితుల్లా ఉండాలి. అప్పుడే ఎక్కడికి వెళ్లినా, ఏమి చేసినా తల్లిదండ్రులకు నిర్భయంగా తెలపగలరు. అంతే కాక చెప్పిన విషయాలను కూడా చక్కగా ఆలకిస్తారు. ముఖ్యంగా సెలవుల సందర్భంగా తల్లిదండ్రులు పిల్లల కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించాలి. అప్పుడే పిల్లలు బయటికి వెళ్లి ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు వీలవుతుంది. సెలవుల సమయంలో పిల్లల గురించి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– వై.సతీష్ కుమార్, కెమిస్ట్రీ లెక్చరర్, విజయనగరం.

ఇటీవల ఇద్దరు యువకులు, ఇద్దరు చిన్నారుల మృతి

పార్వతీపురం రూరల్: ఇప్పటికే కాలానుగుణంగా వర్షాలతో పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా వాగులు, చెరువులు పొంగి నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. అయితే ఈత సరదాతో కొందరు చిన్నారులు పాఠశాలల సెలవు దినాల్లో స్నేహితులతో కలిసి నేలబావుల వద్ద, చెరువుల వద్ద, వాగులు, గెడ్డల వద్ద ప్రమాదకర స్థాయిలో ఈతకొట్టేందుకు వెళ్తున్నారు. లోతు పరిమాణం, ప్రవాహం అంచనా వేయలేని పరిస్థితుల్లో యువకులు, చిన్నారులు నీటి ప్రవాహంలో చిక్కుకుని మృతిచెంది తల్లిదండ్రులకు తీరని గర్భశోకం మిగులుస్తున్నారు.

దసరా సెలవులకు ఇంటికి వచ్చి మృత్యుఒడిలోకి..

దసరా సెలవులకు ఇంటికి వచ్చిన సీతంపేట మండలం అచ్చబ గ్రామానికి చెందిన కొండగొర్రి మౌనిక(12), పాలక అంజలి(11) తమ గ్రామంలో ఉన్న చినబంద చెరువు దగ్గరకు ఈత సరదాతో వెళ్లి చెరువులో ప్రమాదవశాత్తు మునిగి ప్రాణాలు విడిచారు. ఇంట్లో తల్లిదండ్రులు బయట ప్రాంతాలకు పనుల నిమిత్తం వెళ్లిపోవడంతో చిన్నారులు కాస్త ఈత సరదాతో ప్రాణాలు పోగొట్టుకోవడంతో వారి తల్లిదండ్రుల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చారు.



చినబొండపల్లి చెరువులో ప్రమాదకరంగా ఈతకొడుతున్న స్థానిక చిన్నారులు

స్థానికంగా ఉన్న ముత్యాలు బాలికల ఆశ్రమ పాఠశాలలో 6,7 తరగతులు చదువుతున్న ఈ ఇద్దరు విద్యార్థులు ఇటీవల దసరా సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చి సోమవారం దుర్మరణం చెందారు.

వివాహ వేడుకకు వచ్చి మృతి..

గడిచిన మే నెల 20న పార్వతీపురం మండలంలోని పులిగుమ్మి గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న సాకిగెడ్డలో నూజివీడు ప్రాంతం నుంచి వచ్చిన ఐదుగురు స్నేహితులు ఈత సరదాతో గెడ్డలో దిగడంతో వారిలో ఈత రాని ఈశ్వర్‌కుమార్(16), నగిరెడ్డి రాము(16) ప్రవాహంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. దీంతో మరో రెండు రోజుల్లో జరగాల్సిన పెళ్లింట విషాద ఛాయలు అలుముకున్నాయి.

తల్లిదండ్రులు గమనించాలి



ఆటలు, ఈత సరదాపై తల్లిదండ్రులకు చెబితే వద్దంటారని వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అవగాహన రాహిత్యంతో పిల్లలు స్నేహితులతో కలిసి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతుంటారు. అయితే తల్లిదండ్రులు వారికి అర్థమయ్యే విధంగా ఇప్పటికే జరిగిన కొన్ని ఘటనలను నెమ్మదిగా వివరిస్తూ అవగాహన కల్పించాలి. అలాగే ఎప్పటికప్పుడు సెలవు దినాల్లో పిల్లలను ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

– కె. మురళీధర్, సీఐ, పార్వతీపురం పట్టణం

సిరిమాను చెట్టును దర్శించిన బొత్స, బెల్లాన, చిన్న శ్రీను



సిరిమాను చెట్టును దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, మాజీ ఎంపీ చంద్రశేఖర్



సిరిమాను చెట్టును దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు

గంట్యాడ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీపైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును మండలంలోని కొండ తామరపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మజ్జి శ్రీనివాస్‌రావు(చిన్న శ్రీను), గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సిరిమాను చెట్టుకు పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏటా పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును దర్శించుకుంటున్నామని తెలిపారు. అమ్మవారు జిల్లా ప్రజల అందరిని చల్లగా చూడాలని కోరుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ.సూర్యనారాయణ రాజు(పులిరాజు), పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, వైఎస్సార్‌సీపీ జామి మండల అధ్యక్షుడు గొర్లె రవికుమార్, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, గంట్యాడ మండల యువజన విభాగం అధ్యక్షుడు కొండెల విజయ్‌కుమార్, కొండతామరాపల్లి సర్పంచ్ కోడెల ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

విజయనగరం క్రైమ్: నడుచుకుంటూ రోడ్డుపై వెళ్తున్న 20ఏళ్ల యువకుడిని ఓ కారు ఢీ కొట్టడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై లక్ష్మీ ప్రసన్నకుమార్ తెలిపారు. విజయనగరంలోని బాలాజీ జంక్షన్ వద్ద గణేష్ (20) అనే యువకుడు నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన కారు ఆ యువకుడిని ఢీ కొట్టింది. దీంతో కింద పడిన గణేష్ తలకు బలమైన గాయం తగలడంతో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స కోసం బంధువులు తరలించారు. అప్పటికే బ్రెయిన్ డెడ్ అవడంతో చికిత్స చేస్తుండగా మృతి చెందాడు.



గణేష్ మృతదేహం

క్రమశిక్షణతో మెరుగైన జీవితం

డెంకాడ: క్రమశిక్షణ జీవితాన్ని తీరిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని రాష్ట్ర రిసోర్సు డవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి అన్నారు. జొన్నాడ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతులో ఆయన మాట్లాడుతూ..ఇంజినీర్లకు లోక జ్ఞానం తప్పనిసరన్నారు.పార్వతీపురం జట్టు ఆశ్రమానికి చెందిన సామాజిక కార్యకర్త పద్మజ మాట్లాడుతూ.. మొదటి సంవత్సరం విద్యార్థులు ఇంజినీరింగ్ పయనాన్ని గొప్ప కట్టుబాటుతో ప్రారంభించాలన్నారు. సృజనాత్మక, విమర్శనాత్మక జ్ఞానం సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, చైర్మన్ పి.మధుసూదనరావు, కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర రిసోర్స్ డవలప్‌మెంట్ మాజీ డైరెక్టర్ జనరల్ చక్రపాణి

కొత్తవలసలో భారీ వర్షం

● ముంచెత్తిన వరద నీరు



చెరువును తలపిస్తున్న అరకు-విశాఖ జాతీయ రహదారి

కొత్తవలస: కొత్తవలసను మంగళవారం కురిసిన భారీ వర్షం అతలాకుతలం చేసింది. గృహాలు, షాపుల్లోకి వరదనీరు పొంగి పొరడంతో పట్టణవాసులు నానా అవస్థలు పడ్డారు. స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్, మేజర్ పంచాయతీ కార్యాలయం, అరకు–విశాఖ జాతీయ రహదారి, కొత్తవలస-విజయగనరం రోడ్డు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అధిక వరద కారణంగా కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జిని రైల్వే అధికారులు తాత్కాలికంగా మూసేశారు. రైల్వే పోలీసులు బ్రిడ్జి వద్ద బందోబస్తును నిర్వహించారు. కాగా కొత్తవలసను కొద్ది నెలలుగా వర్షం నీరు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మండల కేంద్రంలో గల వీరసాగరం చెరువు నుంచి వచ్చే మిగులు నీరు గతంలో కాలువల వెంబడి పారేది. ప్రస్తుతం కాలువలను పలువురు ఆక్రమించి పూర్తిగా కప్పేశారు. దీంతో వరద నీరు రోడ్లుపై పొంగి పారుతోంది. అధికారులు దృష్టి సారించి ఆక్రమణలను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



గవరపాలెం గెడ్డ పరిస్థితి

పొంగిపొర్లుతున్న గవరపాలెం గెడ్డ

కొత్తవలస: మండల కేంద్రం నుంచి సబ్బవరం రోడ్డులో గవరపాలెం గెడ్డ మంగళవారం కురిసిన భారీ వర్షానికి పొంగిపొర్లుతోంది. గెడ్డ అత్యంత ఉద్రిక్తంగా పారుతుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తవలస నుంచి నిత్యం ఈ రోడ్డులో అనకాపల్లి జిల్లా సబ్బవరం, కొత్తవలస మండలం దెందేరు.సంతపాలెం, గులివిందాడ, గనిశెట్టిపాలెం తదితర గ్రామాలకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. గెడ్డ పొంగి పారడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. రాత్రి వరకు వరదనీరు తగ్గకపోవడంతో వాహనదారులు నిరీక్షించారు.

కొత్త అధికారులకు సవాల్‌గా
పైడితల్లి జాతర!

● 2వేల మంది సిబ్బందితో బందోబస్తు

విజయనగరం క్రైమ్: జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్, ఎస్పీలు అనుభవం ఉన్న అధికారులే. ఇద్దరూ వారి వారి రంగాల్లో సిబ్బంది, అధికారుల చేత పని చేయించిన వారే. ఇద్దరి పరిపాలనా కాలంలో వచ్చే నెలలో జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రానికే వన్నె తెచ్చి పెట్టే నిర్వహించనున్న పండగ రానుంది. కానీ ఆ పండగ నిర్వహణను సమర్థవంతంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా గత ఏడాది లాగానే ఈ ఏడాది పండగ ప్రశాంతంగా జరిగిందని సామాన్యులు భావించేలా చేయగలరా అన్నదే ఇద్దరు అధికారుల ముందున్న సవాల్. వాస్తవానికి విజయనగరం ఆడపడుచు శ్రీశ్రీశ్రీ పైడితల్లి జాతర మహోత్సవం నిర్వహణ జిల్లా అధికార యంత్రాంగానికి అందె వేసిన చెయ్యి. అందునా దేవాదాయ శాఖ జాతరను ఇట్టే నిర్వహించగలదు. ఎటొచ్చీ జాతర నిర్వహణ ప్రశాంతంగా, సురక్షితంగా ఈ ఏడాది పూర్తి చేయడం అటు దేవాదాయ, ఇటు పోలీస్ శాఖ పైనే ఆధారపడి ఉంది. ఇంతవరకు, ఇన్నాళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విజయనగరంలో ఉగ్రమూలాలున్న సిరాజ్ వ్యవహారాన్ని ప్రజలు చవిచూశారు. సాంస్కృతిక వారసత్వసంపద కలిగిన విజయనగరంలోని ఆబాద్ వీధికి చెందిన సిరాజ్‌ను ఎన్‌ఐఏ పట్టుకోవడం వారం రోజుల పాటు టూటౌన్ పోలీసుల సమక్షంలో విచారణ సాగించడం, ఆపై విశాఖ సెంట్రల్ జైల్లో ఎన్‌ఐఏ ఆధ్వర్యంలో ఉన్న సిరాజ్‌ను ఇక్కడి కోర్టు జడ్జి వెబ్‌కామ్ ద్వారా విచారణ చేయడంతో సిరాజ్ ఎంతటి ఉగ్రవాదో..అలాగే విజయనగరంలో ఎన్నిచోట్ల బాంబు పేలుళ్లకు పథక రచన చేశాడో ఇప్పటికే పోలీసులు ఓ అంచనాకు వచ్చి ఉంటారు. ఇటువంటి సమయంలోనే కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్‌ల ఆధ్వర్యంలో పైడితల్లి జాతర జరగనుంది. ఇద్దరూ పండగ నిర్వహణకు కొత్తే. మరోవైపు దేవాదాయ శాఖ ఆలయ ఈఓ శిరీషకు కూడా పండగ నిర్వహణ కొత్తే. ఇక జాతర నిర్వహణకు దాదాపు 2 వేల మంది సిబ్బంది అవసరమని పోలీస్ శాఖ గుర్తించింది. పొరుగు జిల్లాల నుంచి కూడా సిబ్బందిని తీసుకువచ్చే పనిలో పడింది. ఈ బందోబస్తు నిర్వహణలో విజయనగరం పరిధిలోని మూడు స్టేషన్ లలో ఒక్క టూటౌన్ స్టేషన్ సీఐ శ్రీనివాస్ మినహా మిగిలిన వన్ టౌన్, రూరల్ స్టేషన్‌ల సీఐలకు కొత్తే. ఇక విజయనగరం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆర్.గోవిందరావు అటు లా అండ్ ఆర్డర్, మహిళ, ట్రాఫిక్ విభాగాలకు డీఎస్పీగా వ్యవహరిస్తుండడం విశేషం. ఇక దిగువ స్థాయిలో బందోబస్తు నిర్వహణ చూసే సిబ్బందికి మాత్రం జాతర నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లలో అనుభవం ఉంది. ప్రధానంగా ట్రాఫిక్ రెగ్యులరైజేషన్, వాహనాల పార్కింగ్‌ల గతేడాదిలాగానే ఎంటెక్ చదివిన పీసీ సింహాచలం వేసిన స్కెచ్‌ను ఈ ఏడాది కూడా అమలు చేస్తే వాహనదారులు సులభంగా జాతర కు వచ్చి చూసి తరించి తిరిగి ఇళ్లకు చేరుకోగలుగుతారు.



ఎండగ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

జాతర సమర్థవంతంగా నిర్వహిస్తాం

శ్రీశ్రీశ్రీ పైడితల్లి జాతరను సమర్థవంతంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా, నిర్వహిస్తామని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు అన్నారు. సిరిమాను ఉత్సవానికి బందోబస్తు నిర్వర్తించడంలో అనుభవం ఉందన్నారు.అమ్మదయతో సిరిమాను ఉత్సవం గతేడాది లాగానే త్వరగా ముగించేలా చర్యలు చేపడతామని డీఎస్పీ గోవిందరావు తెలిపారు.

పిడుగు పడి పశువుల కాపరి మృతి



సూర్యనారాయణ మృతదేహం

బొండపల్లి: పాడి పశువులను మేతకు తోలిన పశువుల కాపరిపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బొండపల్లి మండలంలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని పెద్దమజ్జి పాలెం గ్రామానికి చెందిన సుంకరి సూర్యనారాయణ(63) తన పాడి పశువులను మేత కోసం బొండపల్లి మండలంలోని వెదురువాడ గ్రామ రెవెన్యూలోని చింతల తోపు వద్దకు తోలాడు. ఈ క్రమంలో పశువులను మేపుతూ కాపలాగా ఉండగా సాయంత్రం ఉరుములు,మెరుపుల వర్షంతో పాటు పిడుగులు పడగా పిడుగు పాటుకు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. గమనించిన తోటి రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు తహసీల్దార్ డోలా రాజేశ్వర్రావుతో పాటు, ఎస్సై యు.మహేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలో వచ్చే నెల ఐదు, ఆరో తేదీల్లో నిర్వహించనున్న విజయనగరం ఉత్సవాలను పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ యు. మాణిక్యంనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న మండల, 27న డివిజన్, 30న జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. 6 నుంచి 8వ తరగతి విద్యార్థులను జూనియర్ విభాగంలో.. 9, 10వ తరగతి విద్యార్థులను సీనియర్ విభాగంలో తలపడాల్సి ఉంటుందన్నారు. విజయనగరం జిల్లా చరిత్ర, సాంస్కృతిక వైభవం అంశంపై వ్యాసరచన పోటీలు... గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి కృషిపై వక్తృత్వం పోటీలు ఉంటాయన్నారు.

ఉత్తరాంధ్ర సాంస్కృతిక చిహ్నం పైడితల్లి పండగ

● అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో సిరిమాను జాతర
● సిరిమాను తిరిగే ప్రదేశాలను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

విజయనగరం టౌన్: సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఉత్తరాంధ్ర సాంస్కృతిక చిహ్నమని, లక్షలాది మంది భక్తులు తరలివచ్చే ఈ జాతరను విజయవంతం చేసే విధంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఎస్పీ ఎఆర్.దామోదర్ సూచించారు. అమ్మవారి చదురుగుడి పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, బారికేడ్లు ఏర్పాట్లు, సిరిమాను తిరిగే ప్రాంతాలను మంగళవారం వేకువజామున అధికారులతో కలిసి వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటం మనందరి బాధ్యతని గుర్తు చేశారు. పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వైద్య శిబిరాలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాలన్నారు. జాతర ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనాలపై ప్రత్యేక దృష్టి సారించి రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సిరిమాను జాతరలో భక్తుల రక్షణ కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్టు ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ వ్యవస్థ, మహిళల భద్రత, రాత్రి పహారా వంటి చర్యలను కఠినంగా అమలు చేస్తామన్నారు. భక్తులు శాంతిభద్రతల నిబంధనలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిరిమాను జాతర ఆధ్యాత్మిక, సామాజిక ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ అధికారులు ఈ ఉత్సవం ఉత్తరాంధ్రలో ఏకత్వానికి ప్రతీకగా, భక్తుల విశ్వాసం నిలబెట్టే విధంగా ప్రతి శాఖ ముందంజలో ఉంటూ పని చేయాలని సూచించారు. ముందుగా అమ్మవారి క్యూలైన్లు, సిరిమాను తిరిగే అమ్మవారి ఆలయం నుంచి కోట వరకూ పరిశీలన చేశారు. ప్రసాదాల పంపిణీ, మీడియా పాయింట్ ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం పూజారి ఇంటి వద్ద చేపట్టనున్న సిరిమాను తయారీ, అక్కడ నుంచి గుడి వరకూ సిరిమాను తరలించే విధానం తెలుసుకుని ఆ మార్గమంతా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కీర్తి, ఏసీపీ సౌమ్యలత, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీషా, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, తహసీల్దార్ కూర్మనాథ్, సిరిమాను అధిరోహకులు బంటుపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



సిరిమాను తిరిగే ప్రదేశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

సిరిమాను తరలింపు నేడు

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో కీలకఘట్టమైన సిరిమాను మహోత్సవానికి సంబంధించిన సిరిమాను, ఇరుసుమానులు గంట్యాడ మండలం కొండతామరాపల్లి గ్రామంలో చల్లా అప్పలనాయుడు, నారాయణమూర్తి, రామకృష్ణ, లోకవరపు సత్యం కళ్లాల్లో సాక్షాత్కరించాయి. సంప్రదాయబద్ధంగా మేళతాళాలు, బాజాభజంత్రీలతో ఈ నెల 24న బుధవారం సిరిమాను తీసుకువచ్చేందుకు జిల్లా అధికారయంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష పర్యవేక్షణలో సిరిమాను, ఇరుసుమానులకు ఉదయంనుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని సిరిమానును దర్శించుకుని గొడ్డలిపెట్టుతో అమ్మవారి ఉత్సవానికి నాంది పలుకుతారు. తర్వాత వడ్రంగులు చింతలు తీర్చే చింతమాను లను కొండతామరాపల్లి గ్రామం నుంచి ఎడ్లబండ్లపై ఎక్కించి, బాజాభజంత్రీలు, అమ్మవారి దీక్షాపరుల భజన కీర్తనలతో, దారిపొడవునా భక్తుల నీరాజనాలతో రాత్రి సుమారు 11 గంటల వరకూ ర్యాలీగా వచ్చి హుకుంపేట పూజారి ఇంటికి తరలిస్తారు.

సిరిమాను ,ఇరుసుమాను వచ్చే మార్గమిదే..

కొండతామరాపల్లి గ్రామంలో కొలువైన సిరిమాను, ఇరుసుమానులకు ప్రత్యేక పూజలనంతరం వడ్రంగులు ప్రత్యేకంగా తయారుచేసిన ఎడ్లబండ్లపై ఎక్కిస్తారు. అక్కడి నుంచి అమ్మవారు వెలిసిన వనంగుడి ప్రదేశానికి తరలిస్తారు. అక్కడ ప్రత్యేక పూజలను నిర్వహించి, ఘటాలను సమర్పించి పసుపు, కుంకుమ, వేపాకులు కలిపిన నీటితో తల్లికి భక్తులు చల్లదనం చేస్తారు. అక్కడి నుంచి నేరుగా హుకుంపేటలో ఉన్న పూజారి ఇంటివద్దకు తరలిస్తారు. నాటి నుంచి చింతమానును సిరిమాను, ఇరుసుమానులుగా మలిచేప్రక్రియను వడ్రంగులు అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తారు.